# విలీనంతో పెరిగిన వార్డులు

- గతంలో 15.. ప్రస్తుతం 18..
- పరిగి మున్సిపాలిటీలో కలిసిన ఆరు గ్రామాలు
- గణనీయంగా పెరిగిన ఓటర్ల సంఖ్య
- గ్రామాల రికార్డులను స్వాధీనం చేసుకున్న అధికారులు

పరిగి మున్సిపాలిటీ




పరిగి, ఫిబ్రవరి 2 : పరిగి మున్సిపాలిటీలో ఆరు గ్రామాలను విలీనం చేయడంతో వార్డుల సంఖ్య 15 నుంచి 18కి పెరిగింది. అందుకు అనుగుణంగా ఓటర్ల సంఖ్య సైతం గణనీయంగా పెరిగింది. గ్రామపంచాయతీగా కొనసాగిన పరిగిని 2018 ఆగస్టు 2న మున్సిపాలిటీగా 15 వార్డులతో గత కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే వాటి పాలకవర్గ పదవీ కాలం జనవరి 26తో ముగియగా ప్రస్తుతం ప్రత్యేకాధికారి పాలన సాగుతున్నది. ఈ 15 వార్డుల పరిధిలో 5,132 కుటుంబాలున్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం పరిగి జనాభా 18,241 ఉండగా ప్రస్తుతం సుమారు 30,000 మంది వరకు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. పరిగి మున్సిపాలిటీలో తాజా గణాంకాల ప్రకారం మొత్తం ఓటర్లు 18,541 మంది ఉండగా వారిలో పురుషులు 10,312 మంది, మహిళలు 10,053 మంది ఉన్నారు. ఇదిలావుండగా పరిగి మున్సిపాలిటీని ప్రభుత్వం విస్తరించింది. పరిగికి 5 కిలోమీటర్ల లోపు ఉన్న ఆరు గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేయడంతో మొత్తం ఓటర్ల సంఖ్య సుమారుగా 25,191 చేరింది. అలాగే విలీన గ్రామాలతో వార్డుల సంఖ్య 15 నుంచి 18కి పెరిగింది.

## విలీన గ్రామాలు ఆరు..

పరిగి మున్సిపల్‌కు 5 కిలోమీటర్ల పరిధిలో ఉన్న 6 గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అందులో నస్కల్, రుక్కుంపల్లి, సుల్తాన్‌పూర్, సయ్యద్‌మల్కాపూర్, నజీరాబాద్, శాఖాపూర్‌లను మున్సిపాలిటీలో విలీనం చేస్తూ కమిషనర్ అండ్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఉత్తర్వులు జారీ చేశారు. నస్కల్ గ్రామంలో 964 కుటుంబాలుండగా 2,606 మంది ఓటర్లు, నజీరాబాద్‌లో 388 కుటుంబాలుండగా 1,035 మంది, సుల్తాన్‌పూర్‌లో 585 కుటుంబాలుండగా 1,606 మంది, సయ్యద్‌మల్కాపూర్‌లో 327 కుటుంబాలుండగా 830 మంది, రుక్కుంపల్లిలో 198 కుటుంబాలుండగా 573 మంది ఓటర్లు ఉన్నారు. శాఖాపూర్‌లో నివాసాలు ఏమి లేకపోగా ఈ గ్రామ పరిధిలో భూములు ఉన్నాయి. ప్రభుత్వ నిర్ణయంతో ఆరు గ్రామాలు పరిగి మున్సిపాలిటీ పరిధిలోకి వచ్చాయి.

### రికార్డులు స్వాధీనం..

పరిగి మున్సిపాలిటీలో విలీనమైన గ్రామపంచాయతీల రికార్డులను మున్సిపల్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆయా గ్రామ పంచాయతీలకు సంబంధించిన ప్రొఫైల్, రికార్డులను స్వాధీనం చేసుకోవాలని సీడీఎంఏ నుంచి ఆదేశాలు రావడంతో వాటి ని అధికారులు తీసుకున్నారు.
అదేవిధంగా జీపీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల వివరాలు, పంచాయతీలకు సంబంధించిన స్థిర, చరాస్తులు, డిపాజిట్లు, పెట్టుబడులు, పన్నులు, బ్యాంకు ఖాతాలు, సామగ్రి, బిల్లుల వివరాలు, మూడేండ్లకు సంబంధించిన లే అవుట్లు, పంచాయతీ భవనాల వివరాలను సేకరించి.. పూర్తి వివరాలతో కూడిన నివేదికను అధికారులు సీడీఎంఏకు అందజేశారు. కాగా ఆయా గ్రామపంచాయతీ కార్యదర్శులుగా కొనసాగుతున్న వారు మున్సిపాలిటీల్లో పనిచేసేందుకు ఆప్షన్ ఇస్తే కొనసాగించనున్నారు, లేనియెడల ఇతర గ్రామాల పంచాయతీ కార్యదర్శులుగా పంపిస్తారు.


శ్రీశ్రీ హోంకాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే పి సబితా ఇంద్రారెడ్డి

# ఇంటింటికీ తాగునీరు ఇచ్చిన ఘనత కేసీఆర్‌దే

## మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, ఫిబ్రవరి 2: మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు అందించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ శ్రీశ్రీ హోంకాలనీలో ఆదివారం ఆమె పర్యటించారు. ఓపెన్ జిమ్ కోసం ఏర్పాటు చేసిన స్థలాన్ని, పరికరాలను పరిశీలించారు. కాలనీలో ఉన్న డ్రైనేజీ, రోడ్ల సమస్యలను కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గంలో ఉన్న నీటి సమస్యను పరిష్కరించేందుకు మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ రూ. 375 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సమస్య పరిష్కారమైందని, గతంలో వారానికోసారి వచ్చే నీళ్లు.. ఇప్పుడు రోజు తప్పి రోజు వస్తున్నాయన్నారు. భవిష్యత్‌లో నీటి సమస్య రాకుండా 9 రిజర్వాయర్లను నిర్మించినట్లు చెప్పారు. చెరువులోకి మురుగు నీరు పోకుండా ఉండేందుకు ఎస్ఎన్‌డీపీ నిధులతో నాలాల నిర్మాణానికి రూ. వంద కోట్లు కేటాయించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు రద్దు చేయడం ద్వారా పనులు అర్ధాంతరంగా ఆగిపోయినట్లు ఆమె గుర్తు చేశారు. మహేశ్వరం నియోజకవర్గంలో రూ. 270 కోట్లు రద్దు కావడంతో పలు అభివృద్ధి పనులు మధ్యలోనే నిలిచిపోయాయన్నారు. కాంగ్రెస్ సర్కార్ ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో నిధులు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నదన్నారు. ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతతో కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించడం లేదన్నారు. కార్యక్రమంలో డీఈలు జ్యోతి, నర్సింహారాజు, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, మాజీ కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అంతా తానై..

బడంగ్‌పేట కార్పొరేషన్‌లో డీఈ తీరుపై విమర్శలు




బడంగ్‌పేట, ఫిబ్రవరి 2 : బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో అధికారుల మధ్య వివాదం ముదిరింది. అది చిలికిచిలికి గాలి వానగా మారింది. ఇంజినీరింగ్ విభాగంలో మొదలైన వివాదం.. అన్ని విభాగాలకు పాకింది. దీంతో అధికారుల మధ్య అంతర్ యుద్ధం నడుస్తున్నది. బడంగ్‌పేటలో ఉన్న 32 డివిజన్లపై డీఈ జ్యోతి ఆధిపత్యం సాగిస్తూ..వస్తున్నారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రస్తుతం ముగ్గురు డీఈలున్నారు. యాదయ్య, నర్సింహారాజు, జ్యోతి..వీరు 32 డివిజన్ల పరిధిలో ఉన్న అభివృద్ధి పనులు చేసుకోవాల్సి ఉంటుంది. 32 డివిజన్లకు ఏఈ వినీల్‌గౌడ్ ఒక్కరే ఉన్నారు. అయితే ఏఈలు చేయాల్సిన పనులన్నీ డీఈ జ్యోతి చేస్తున్నారు. అభివృద్ధి పనులకు ఎస్టిమేషన్ వేయాలన్న, టెండర్ వేయాలన్నా..ఏఈ తప్పనిసరిగా క్షేత్ర స్థాయిలో పరిశీలించాల్సి ఉంటుంది. ఏఈ స్థానంలో డీఈ జ్యోతి సంతకాలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. యాదయ్య, నర్సింహారాజుకు ఉన్న డివిజన్లు కట్ చేశారు. డీఈ జ్యోతి అంతా తానై మున్సిపల్ కార్పొరేషన్‌లో తనదైన ముద్ర వేసుకున్నారు. రాజకీయ అండదండలు ఉండడం అందుకు కారణమైంది. ఇటీవల అడ్డగోలుగా ముందస్తు పనులు చేసిన విషయంలో వివాదం మరింత ముదిరినట్లు తెలుస్తున్నది. 32 డివిజన్లను ముగ్గురు డీఈలు సమానంగా పనులు చేయాల్సి ఉంటుంది. అందుకు జ్యోతి అంగీకరించకపోవడంతో వారి మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి.

### ఏఈ పనులు సైతం..

ఏఈ చేయాల్సిన పనులు కూడా డీఈ చేస్తుండడంతో గొడవ మొదలైంది. ఏఈ వినీల్‌గౌడ్ చూస్తున్న డివిజన్లను తొలగించి డీఈ చూడడంతో వారి మధ్య మరింత వివాదం ఏర్పడింది. డీఈ ఎవరికీ తెలియకుండానే వర్క్ ఇన్‌స్పెక్టర్లను మార్చారు. దీంతో వారు ఈ విషయాన్ని కమిషనర్ సరస్వతికి వివరించారు. డీఈ ఇబ్బంది పెడుతున్నట్లు వివరించారు. తమకు న్యాయం చేయాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. రిటైర్డ్ (సస్పెండ్) అయిన వ్యక్తి ద్వారా పనులు చేయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

### డీఈపై అధికారులకు ఫిర్యాదు..

కొంతమంది కాంట్రాక్టర్లను గంటల తరబడి తన చాంబర్‌లో కూర్చోబెట్టుకోవడం, మరి కొంతమంది కాంట్రాక్టర్లు ఫోన్ చేసినా కనీసం మాట్లాడకపోవడం, సమయం ఇవ్వకపోవడం వంటివి జరుగుతుండడంతో సదరు డీఈపై పై అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా వారి శైలి మారడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

### కమిషనర్ చాంబర్‌లోనే లొల్లి

ఇంజినీరింగ్ విభాగంలో జరుగుతున్న తీరును తెలుసుకున్న కమిషనర్ సరస్వతి శనివారం సాయంత్రం ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న డీఈ, ఏఈలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అధికారుల మధ్య నెలకొన్న వివాదాలపై ఆమెను అడిగి తెలుసుకున్నారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ లో ఉన్న 32 డివిజన్లను అందరూ సమానంగా చూసుకోవాలని కమిషనర్ సూచించారు. అందుకు డీఈ జ్యోతి అంగీకరించలేదు. అన్ని తానే చూస్తానని చెప్పడంతో కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 16 డివిజన్లు నర్సింహారాజు, 16 డివిజన్లు డీఈ జ్యోతి చేసుకోవాలని కమిషనర్ తెలిపారు. 32 డివిజన్లను ఏఈ వినీల్‌గౌడ్ చూస్తారని చెప్పారు. ఏఈ పనిచేయలేదని కమిషనర్ ముందు డీఈ ప్రస్తావించారు. దీంతో కమిషనర్ ముందే లొల్లి మొదలైంది. కాగా, బడంగ్‌పేటలో జరుగుతున్న తతంగం చూసి డీఈ యాదయ్య తప్పుకొన్నారు. తాను కూడా వెళ్లిపోతానని డీఈ నర్సింహారాజు కమిషనర్‌కు వివరించారు. దీంతో వారి మధ్య గొడవ గందరగోళంగా మారింది. కమిషనర్ ముందే ఒకరి పై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. మరోవైపు ఈ గొడవల వెనుక ఏదో బలమైన కారణం ఉంటుందన్న చర్చ జరుగుతున్నది.

# అర్జెంట్ అయితే ఎక్కడికెళ్లాలి..?

## గ్రేటర్‌లో మలమూత్ర విసర్జనకు మరుగుదొడ్లు కరువు

- ప్రస్తుతం రికార్డులో 1857లో పబ్లిక్ టాయిలెట్లు..
- పనిచేస్తున్నవి 1385 మాత్రమే
- 472 చోట్ల వినియోగంలో లేవని గుర్తింపు
- అందుబాటులో ఉన్నవి సైతం అపరిశుభ్రంగానే..
- నిర్వహణ లోపంపై అధికారులపై కమిషనర్ ఆగ్రహం
- స్వచ్ఛ ర్యాంకుల ప్రకటన దరిమిలా సవాల్‌గా మారిన పబ్లిక్ టాయిలెట్ల అంశం




సిటీబ్యూరో, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ ): జీహెచ్ఎంసీలో వందకు వంద శాతం బహిరంగ మలవిసర్జన రహిత నగరంగా సాధించాలనే లక్ష్యానికి అధికారులు నీళ్లొదిలారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత (ఓడీఎస్ ప్లస్ ప్లస్) నగరంగా హైదరాబాద్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందగా..ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. గత కేసీఆర్ ప్రభుత్వంలో ఓడీఎఫ్, ఓడీఎఫ్ ప్లస్, వాటర్ ప్లస్, స్వచ్ఛ హైదరాబాద్ వంటి ర్యాంకులతో హైదరాబాద్ నగరానికి ప్రత్యేక గుర్తింపు వచ్చింది.
కానీ గడిచిన ఏడాది కాలంగా టాయిలెట్ల నిర్వహణ అధ్వానంగా మారింది. కనిపించని పబ్లిక్ టాయిలెట్లకు బిల్లులు, వినియోగించని మరుగుదొడ్లకు నిర్వహణ వ్యయం చెల్లించడం జీహెచ్ఎంసీకే చెల్లింది. ప్రతి అరకర కిలోమీటరు రద్దీ రోడ్లలో మహిళలు, పురుషులకు వేర్వేరుగా మరుగుదొడ్లను ఏర్పాటు చేయాల్సిన అధికారులు.. ప్రస్తుతం ఆరు జోన్లలో 4826 సీట్లలో 1857 పబ్లిక్ టాయిలెట్లను మాత్రమే నిర్మించినట్లు లెక్కలు చెబుతున్నాయి. ముఖ్యంగా 1385 చోట్ల మాత్రమే టాయిలెట్లను వినియోగిస్తున్నట్లు అధికారులు కమిషనర్‌కు నివేదిక ఇటీవల అందజేశారు. అంటే 472 చోట్ల టాయిలెట్లు వినియోగంలోకి లేవని, క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమని ఆ నివేదికలో పేర్కొన్నారు. దీనిపై కమిషనర్ ఇలంబర్తి సీరియస్ అయినట్లు తెలిసింది. త్వరలో స్వచ్ఛ సర్వేక్షణ్ 2024 ర్యాంకుల ప్రకటన సందర్భంగా సర్వే జరుగుతున్న దరిమిలా పబ్లిక్ టాయిలెట్లను నిర్వహణ అంశాన్ని పరిగణనలోకి తీసుకోనున్నారు. ఈ నేపథ్యంలోనే పబ్లిక్ టాయిలెట్ల అన్నింటిని వినియోగంలోకి తీసుకురావాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### ప్రజాధనం వృథా

టాయిలెట్ల క్షేత్రస్థాయిలో లేకున్నా వాటి పేరుతో కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా చేస్తున్నట్లు, ఇందులో కొన్ని ఏజెన్సీలతో అధికారులు కుమ్మక్కై చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో నిర్మించిన పబ్లిక్ టాయిలెట్లలో సగానికి పైగా వినియోగంలో లేవని, కొన్ని చోట్ల గాయబ్ అయ్యాయని, బిల్లులు చెల్లింపులు మాత్రం యథావిధిగా జరుపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. చాలా చోట్ల నల్లాలు, డోర్లు, ఇతర సామగ్రి చోరీకి గురవ్వడంతో నిరుపయోగంగా మారాయి. దీంతో వివిధ పనుల కోసం వచ్చే వారికి 'అర్జెంట్ ' అయితే ఎక్కడికి వెళ్లాలో అర్థం కానీ పరిస్థితి నెలకొనడం విచారకరం.

### నీళ్లు ఉంటలే..క్లీన్ చేస్తలే

ఆర్టీసీ బస్టాప్‌లు, ఫుట్‌పాత్‌లు , పార్కుల వద్ద ఏర్పాటు చేసిన టాయిలెట్లలో చాలా వరకు ప్రస్తుతం కనిపించడం లేదు. వాస్తవానికి కమర్షియల్ ఏరియాల్లో ఉండే టాయిలెట్లను రోజుకు నాలుగు సార్లు, నాన్ కమర్షియల్ రోజుకు కనీసం మూడు సార్లు టాయిలెట్లను క్లీన్ చేయాల్సి ఉంది. డైలీ క్లీనింగ్ చేస్తున్నారా? అంటే లేదనే స్థానికులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కొన్ని టాయిలెట్లకు కనీసం డోర్లు కూడా ఉండడం లేదని చెబుతున్నారు. వీటికి తోడు టాయిలెట్లలో వాటర్ కూడా అందుబాటులో ఉండడం లేదని చెబుతున్నారు. 'పే అండ్ యూజ్' , బస్టాప్‌ల వద్ద ఉండే సులభ్ కాంప్లెక్స్‌లను ఎక్కువగా వినియోగిస్తుండడం గమనార్హం.

### అమలు కానీ స్వచ్ఛ భారత్ మిషన్ మార్గదర్శకాలు

వాస్తవంగా స్వచ్ఛ భారత్ మిషనర్ (పట్టణ) మార్గదర్శకాల ప్రకారం పబ్లిక్ టాయిలెట్లు మార్కెట్లు, రైల్వే స్టేషన్లు , పర్యాటక స్థలాలు, కార్యాలయ సముదాయాల సమీపం, ప్రయాణ ప్రదేశాలలో పబ్లిక్ టాయిలెట్లను ఏర్పాటు చేయాలి. గ్రేటర్‌లో 2వేల వరకు పబ్లిక్ టాయిలెట్లు తప్పనిసరిగా ఉండాలి. కానీ 1385 మాత్రమే ఉండడం అధికారుల పనితీరుకు అద్దం పడుతున్నది.

# హక్కులను సద్వినియోగం చేసుకోవాలి

తెలుగు యూనివర్సిటీ, ఫిబ్రవరి 2 : రాజ్యాంగం కలిపించిన హక్కులను సద్వినియోగం చేసుకుని అన్ని రంగాల్లో గిరిజనులు అభివృద్ధిని సాధించాలని వక్తలు పిలుపునిచ్చారు. పోస్టల్ గిరిజన ఉద్యోగుల తెలంగాణ సర్కిల్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో గిరిజనుల ఆత్మీయ సాంస్కృతిక సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేషనల్ షెడ్యూల్ ట్రైబ్స్ కమిషన్ మెంబర్ హుస్సేన్ నాయక్, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ పాల్గొని మాట్లాడారు. ఐకమత్యంతోనే ఏ రంగంలోనైనా రాణించవచ్చని అన్నారు. ఆర్థికంగా గిరిజనులు ఎదగాలంటే ఉన్నత విద్యలను అభ్యసించేలా పిల్లలను ప్రోత్సహించాలని వారు సూచించారు.

# ఆంగ్లం నేర్చుకుంటే ఉజ్వల భవిత

## సింగరేణి సీఎండీ బలరాం

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 2: ఇంగ్లిష్ భాషను నేర్చుకుంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సింగరేణి సీఎండీ బలరాం అన్నారు. విద్యార్థులు ప్రపంచంలో రాణించాలంటే భాషా నైపుణ్యం అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించడం ద్వారా ఆయా రంగాల్లో రాణించేందుకు సులువవుతుందని చెప్పారు. ఉస్మానియా యూనివర్సిటీ ఇంగ్లిష్ లాంగ్వేజ్ ట్రైనింగ్ సెంటర్ (ఈఎల్‌టీసీ) ద్వారా గిరిజన విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణా తరగతులు ఆదివారం ముగిశాయి.
రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి ఇద్దరు చొప్పున మొత్తం 66 మంది యూజీ చదువుతున్న గిరిజన విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్‌లో శిక్షణ ఇచ్చారు. విద్యార్థులకు ఓయూలో నెలరోజులపాటు వసతి కల్పించి, శిక్షణ అందించగా.. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ ఆర్థిక సాయం చేశారు. ఓయూ ఆర్ట్స్ కళాశాలలోని ఈ క్లాస్ రూంలో నిర్వహించిన కార్యక్రమ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బలరాం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని మారుమూల గిరిజన ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి, లైబ్రరీల ఏర్పాటుకు సింగరేణి తరఫున ఆర్థిక సాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన గిరిజన సమూహాలకూ డా విద్యాభివృద్ధికి తన వంతు సాయం అందిస్తానని ఆయన చెప్పారు. అన్ని సమస్యలకు విద్య మాత్రమే పరిష్కారం చూపుతుందని పేర్కొన్నారు. సాధికారత సాధించేందుకు సుస్థిర విద్యాభివృద్ధి ఎంతో ముఖ్యమని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డి, ఈఎల్‌టీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ విజయ, కార్యక్రమ కో-ఆర్డినేటర్లు ప్రొఫెసర్ సవిన్ సౌడ, ప్రొఫెసర్ క్రిస్టోఫర్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం, ప్రొఫెసర్ పరిమళాకులకర్ణి, డాక్టర్ మాధవి, డాక్టర్ రాజు పాల్గొన్నారు.

# 4 రాష్ట్రాలు..80కిపైగా కేసులు..

## 28 కేసుల్లో మోస్ట్‌వాంటెడ్.. బత్తుల ప్రభాకర్ నేర ప్రస్థానమిది

- దోచుకున్న సొత్తుతో జల్సాలు
- ఖైదీని చంపేందుకు ప్లాన్
- నిఘా పెట్టి..పట్టుకున్న మాదాపూర్ సీసీఎస్ పోలీసులు
- మూడు గన్‌లు... 451 రౌండ్ల బుల్లెట్లు స్వాధీనం
- కేసు వివరాలు వెల్లడించిన డీసీపీ వినీత్



వివరాలు వెల్లడిస్తున్న మాదాపూర్ డీసీపీ వినీత్

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 2 : బత్తుల ప్రభాకర్ తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు నాలుగు రాష్ట్రాల్లో 80కి పైగా కేసుల్లో నిందితుడని, 28 కేసుల్లో మోస్ట్ వాంటెడ్‌గా ఉన్నాడని మాదాపూర్ డీసీపీ వినీత్ తెలిపారు. ప్రీజం పబ్ కాల్పులు కలకలంతో అతడ్ని అదుపులోకి తీసుకున్న సైబరాబాద్, మాదాపూర్ సీసీఎస్ పోలీసులు.. నిందితుడి ఇంట్లో సోదాలు నిర్వహించి మూడు గన్‌లు, 451 రౌండ్ల బుల్లెట్లు, మూడు సెల్‌ఫోన్లు, రూ.62,000 నగదు, ఓ ఎలక్రికల్ రాడ్‌కట్టర్ యంత్రం, ఓ ఐరన్ రాడ్, ఎలక్ట్రికల్ ఎక్స్‌టెన్షన్ బాక్స్, కటింగ్ బ్లేడ్‌లను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. ఆదివారం గచ్చిబౌలిలోని మాదాపూర్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో సైబరాబాద్ క్రైం డీసీపీ నర్సింహులుతో కలిసి కేసు వివరాలు వెల్లడించారు.

### 2013 నుంచి ..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూరు జిల్లా, సోమల దరి మండలం, వడ్డెపల్లి ఇరికిపెంట గ్రామానికి చెందిన బత్తుల ప్రభాకర్ అలియాస్ ప్రభాకర్ రావు, రాజు, రాహుల్‌రెడ్డి, బయ్యపురెడ్డి, సర్వేశ్వర్‌రెడ్డి, బిట్టు, హర్షవర్ధన్ రెడ్డి(30) 9వ తరగతి వరకు చదువుకున్నాడు. 2013లో తాళం వేసి ఉన్న ఇండ్లలో చోరీలతో నేర వృత్తిని ప్రారంభించిన బత్తుల ప్రభాకర్.. తాజాగా పేరొందిన ఇంజినీరింగ్ కళాశాలల్లో చోరీలకు పాల్పడే స్థాయికి చేరాడని.. చోరీ సొత్తుతో ఖరీదైన పబ్బులు, జిమ్‌లు, హోటళ్లకు తరచూ వెళుతూ.. విలాసవంతమైన జీవితానికి అలవాటు పడ్డారని చెప్పారు. 2020లో విశాఖపట్నం జిల్లాలోని పాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీ కేసుతో పాటు మొత్తం 57 చోరీ కేసుల్లో నిందితుడిగా అరెస్టు అయి విశాఖపట్నం సెంట్రల్‌జైలుకు వెళ్లాడు. 2022లో జైలు నుంచి తప్పించుకున్న అతడు.. నేరాలు కొనసాగిస్తున్నప్పటికీ ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రంలో 11 కేసులు, సైబరాబాద్ 5, హైదరాబాద్ 1, రాచకొండ 2, నిజామాబాద్1, సంగారెడ్డి 1, సూఅబ్యూపేట 1, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 12 (వెస్ట్ గోదావరి 6, ఈస్ట్ గోదావరి 3, కృష్ణ 1, ఎన్టీఆర్ డిస్ట్రిక్ 1, విశాఖపట్నం 1) కేసుల్లో నిందితుడు. తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు నాలుగు రాష్ట్రాల్లో 80కి పైగా కేసుల్లో నిందితుడు, 28 కేసుల్లో మోస్ట్ వాంటెడ్‌గా ఉన్నా డు. గత కొద్ది నెలలుగా గచ్చిబౌలి పీఎస్ పరిధిలోని ఓ అపార్టుమెంట్‌లో స్నేహితుడి పేరుతో అద్దెకు ఉంటున్న బత్తుల ప్రభాకర్‌పై నిఘాపెట్టిన మాదాపూర్ సీసీఎస్ పోలీసులు.. శనివారం వారాంతం కావడంతో ప్రీజం పబ్ దగ్గర అతడి కోసం కాపుకాసి పట్టుకున్నారు. ఈ క్రమంలో అతడు పోలీసులపైకి రెండు రౌండ్లు కాల్పులు జరిపగా, సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ వెంకట్‌రెడ్డి ఎడమ పాదానికి గాయమైంది. నిందితుడి నుంచి రెండు దేశవాళీ గన్‌లు, 23 రౌండ్ల బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు.
అనంతరం పోలీసుల అదుపులో ఉన్న ప్రభాకర్ ఇంట్లో సోదాలు నిర్వహించిన పోలీసులు.. మరో దేశవాళీ గన్‌లు, 451 రౌండ్ల బుల్లెట్లు, మూడు సెల్‌ఫోన్లు, రూః 62,000 నగదు, ఓ ఎలక్రికల్ రాడ్‌కట్టర్ యంత్రం, ఓ ఐరన్ రాడ్, ఎలక్ట్రికల్ ఎక్స్‌టెన్షన్ బాంక్సు, కటింగ్‌బ్లేడ్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నామని మాదాపూర్ డీసీపీ వినీత్ పేర్కొన్నారు.

### ఖైదీని చంపేందుకు..

విశాఖపట్నం సెంట్రల్‌జైలులో ఉన్నప్పుడు అక్కడ ఉన్న మరో ఖైదికి బత్తుల ప్రభాకర్‌కు మధ్య వైరం పెరిగి ద్వేషంగా మారిందని, దీంతో ఎలాగైనా జైలు నుంచి తప్పించుకొని సదరు ఖైదీ విడుదలయ్యాక అతడిని హతమార్చాలని వలపన్నినట్లు డీసీపీ తెలిపారు. ఈ క్రమంలో బీహార్ నుంచి మూడు దేశవాళీ గన్‌లు, 453 రౌండ్ల బుల్లెట్లు కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. జైలుకు వెళ్లకముందు ఇండ్లలో చోరీలు చేసిన ప్రభాకర్.. ఆ తర్వాత కేవలం ఇంజినీరింగ్ కళాశాలలు, విద్యాసంస్థలను లక్ష్యంగా చేసుకొని రెక్కీ నిర్వహించి చోరీలకు పాల్పడుతున్నట్లు వివరించారు. ఈ క్రమంలో సైబరాబాద్ పరిధిలో రూ. 2.5 కోట్లు చోరీ చేసినట్లు పేర్కొన్నారు.
సెల్‌ఫోన్ ఎక్కువగా వాడడం, ఎవరితోనూ ఎక్కువగా కలవడం అతడి ఇష్టం ఉండదని, ఒంటరిగా తిరుగుతూ చోరీలు చేయడం.. వచ్చిన డబ్బులతో ఖరీదైన పబ్బులు, హోటళ్లలో జల్సాలు చేయడం, ఖరీదైన జిమ్‌లకు వెళ్లడం హాబీగా మార్చుకున్నాడని డీసీపీ తెలిపారు. మాదాపూర్ ఏసీపీ శ్రీకాంత్, క్రైం డీసీపీ శశాంక్, గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ హబీబ్ ఉల్లాఖాన్, డీఐ రాజేష్‌తో పాటు పలువురు ఈ మీడియా సమావేశంలో పాల్గొన్నారు. మోస్ట్ వాంటెడ్ ప్రభాకర్‌ను పట్టుకున్న మాదాపూర్ సీసీఎస్ పోలీసులు వెంకట్‌రెడ్డి, ప్రదీప్, వీరస్వామీలకు రివార్డులు అందజేసినట్లు డీసీపీ వెల్లడించారు.